**29.05.2020**

**అమరావతి**

- **సీఎం క్యాంప్ కార్యాలయంలో 'మన పాలన–మీ సూచన' కార్యక్రమం.**
- **అయిదో రోజు కార్యక్రమంలో భాగంగా 'వైద్యం–ఆరోగ్యం' పై మేధోమథనం.**
- **లబ్ధిదారులు, వైద్య నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖి:›**
- **ఆస్పత్రుల్లో 9712 మంది వైద్యులు, నర్సులు, సిబ్బంది నియామకం**
- **వారం రోజుల్లో నోటిఫికేషన్. నెలన్నర వ్యవధిలో నియామకాలు**
- **జాతీయ ప్రమాణాల (ఐపీహెచ్ఎస్)కు అనుగుణంగా నియామకం**
- **ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ వెల్లడి**
- **ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో నాడు–నేడు. కొత్తవాటి నిర్మాణం**
- **రాష్ట్రంలో ఇప్పటికే 11 టీచింగ్ ఆస్పత్రులు. కొత్తగా మరో 16**
- **గిరిజన ప్రాంతాల్లో 7 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు**
- **ఆగస్టులో టెండర్లు. మూడేళ్లలో పనులు పూర్తి. రూ.12,270 కోట్ల వ్యయం**
- **ప్రతి వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల**
- **ప్రజారోగ్యంపై మొత్తం మీద రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు**
- **రాష్ట్రంలో మొత్తం 1.42 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ క్యూఆర్ కోడ్ కార్డులు**
- **ఇప్పటికే 1.33 కోట్ల మందికి జారీ. మిగిలినవి మరో 2 వారాల్లో పంపిణీ**
- **జూలై 1న కొత్త 108, 104 సర్వీసులు 1060 వాహనాలు ప్రారంభం**
- **ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక బైక్. థర్మో బ్యాగ్**
- **తద్వారా టెలి మెడిసిన్‌లో ఇంకా వేగంగా మందుల డోర్ డెలివరీ**
- **ఆరోగ్యశ్రీ పరిధిలోకి 2 వేల వ్యాధులు. ప.గో జిల్లాలో పైలట్ ప్రాజెక్టు**
- **జూలై 8 నుంచి మరో 6 జిల్లాలు, దీపావళి నుంచి మిగిలిన జిల్లాల్లో ప్రాజెక్టు**

- ఆరోగ్య ఆసరాలో 9 రకాల వ్యాధిగ్రస్తులకు రూ.3 వేల నుంచి రూ.10 వేల పెన్షన్
- వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దనే పింఛను పంపిణీ
- కోవిడ్‌ను అన్ని విధాల ఎదుర్కోవడానికి సర్వం సిద్ధంగా ఉన్నాం
- వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రులు, బెడ్లు, వెంటిలేటర్లు అన్నీ రెడీ
- 'మన పాలన–మీ సూచన' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెల్లడి.

అమరావతి:ఆస్పత్రుల్లో అన్ని మౌలిక వసతులు మెరుగుపర్చడంతో పాటు, 9712 మంది వైద్యులు, నర్సులు, సిబ్బంది నియామకం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ ప్రకటించారు. వారం రోజుల్లో (జూన్ మొదటి వారంలో) నోటిఫికేషన్ జారీ చేస్తామని, జాతీయ ప్రమాణాల (ఐపీహెచ్ఎస్)కు అనుగుణంగా నెలన్నర వ్యవధిలో నియామకాలు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో నాడు–నేడు కార్యక్రమంలో సమూల మార్పులు చేయడంతో పాటు, కొత్తవాటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 టీచింగ్ ఆస్పత్రులు ఉండగా, కొత్తగా మరో 16 ఏర్పాటు చేస్తున్నామని, దీంతో వాటి సంఖ్య 27కు చేరుకుంటుందని, మరోవైపు గిరిజన ప్రాంతాల్లో 7 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రూ.12,270 కోట్లతో చేపడుతున్న ఈ పనులకు ఆగస్టులో టెండర్లు పిల్చి, మూడేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రతి వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఉంటుందని, ప్రజారోగ్యంపై మొత్తం మీద రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో మొత్తం 1.42 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ క్యూఆర్ కోడ్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే 1.33 కోట్ల మందికి జారీ చేశామని, మిగిలినవి మరో 2 వారాల్లో పంపిణీ చేస్తామని సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు. జూలై 1న కొత్త 108, 104 సర్వీసులు మొత్తం 1060 వాహనాలు ప్రారంభిస్తామని తెలిపారు. మరోవైపు ఆరోజు నాటికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక బైక్, థర్మో బ్యాగ్ కూడా ఇస్తామని, తద్వారా టెలి మెడిసిన్‌లో ఇంకా వేగంగా మందుల డోర్ డెలివరీ చేస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి 2 వేల వ్యాధులు చేర్చి ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు చేపట్టామన్న సీఎం,

జూలై 8 నుంచి మరో 6 జిల్లాలలో, ఆ తర్వాత దీపావళి నుంచి మిగిలిన 6 జిల్లాలకు ఆ ప్రాజెక్టు విస్తరిస్తామని వెల్లడించారు.

ఆరోగ్య ఆసరాలో 9 రకాల వ్యాధిగ్రస్తులకు రూ.3 వేల నుంచి రూ.10 వేల పెన్షన్ వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కోవిడ్‌ను అన్ని విధాల ఎదుర్కోవడానికి సర్వం సిద్ధంగా ఉన్నామన్న ఆయన, వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రులు, బెడ్లు, వెంటిలేటర్లు అన్నీ రెడీగా ఉంచామని వివరించారు.

'మన పాలన—మీ సూచన' కార్యక్రమం అయిదో రోజున 'వైద్యం—ఆరోగ్యం' పై మేధోమథనం జరిగింది. క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వైద్య నిపుణులు, అధికారులతో సీఎం శ్రీ వైయస్ జగన్ ముఖాముఖిలో పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎస్ నీలం సాహ్ని, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విప్లవాత్మక మార్పులకు యోచన

గత ఏడాది కాలంలో వివిధ పథకాలు అమలు చేస్తూనే ఆరోగ్య రంగంలో రెండు అడుగులు ముందుకు వేశామని, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆలోచన చేశామని, ఆ దిశలో అత్యున్నత స్థానంతో అడుగులు ముందుకు వేయగలిగామని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ తెలిపారు. ఆరోగ్యశ్రీలో గత ప్రభుత్వం బకాయిలు పెట్టినా కూడా ముందుకు వెళ్లామని ఆయన చెప్పారు. ఆరోగ్య రంగం అనగానే మనకు గతంలో 108, 104 సర్వీసులు, కుయ్ కుయ్ అన్న శబ్దం వినిపించేదని గుర్తు చేశారు.

## ఆ రెండింటికీ అత్యంత ప్రాధాన్యం:

పేదలు అప్పుల పాలయ్యే పరిస్థితి రెండు సందర్భాలలో వస్తుందన్న సీఎం, ఒకటి అనారోగ్యం కాగా, రెండోది పిల్లల ఫీజులు అని చెప్పారు. అందుకే దివంగత నేత వైయస్సార్ ఈ రెండింటికీ ప్రాధాన్యం ఇచ్చారని, కానీ ఆయన తర్వాత ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేశారని చెప్పారు.

## దారుణస్థితిలో ఆస్పత్రులు

గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి ఏమిటో చూశామన్న సీఎం ఒకటి రెండు ఘటనలు ప్రస్తావించారు. ఆస్పత్రుల్లో పిల్లలను ఎలుకలు కొరికాయని, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో ఆపరేషన్లు చేశారని గుర్తు చేశారు. అంత దారుణ స్థితిలో ఆస్పత్రులు పని చేశాయన్న ముఖ్యమంత్రి, వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల్లో కాంట్రాక్టు రూపంలో డబ్బులు ఇచ్చినా, సేవలు మాత్రం అందలేదని అన్నారు. అందుకే ఆ ఆ పరిస్థితి మార్చాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నది మేనిఫెస్టోలో పెట్టామని, కేవలం రెండు పేజీలు మాత్రమే ఉన్న మేనిఫెస్టో ఇవాళ అందరి దగ్గర ఉందని చెప్పారు.

## ఆరోగ్యశ్రీ విస్తరణ:

ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల వార్షికాదాయం ఉన్న వారికి కూడా వర్తింప చేశామన్న ముఖ్యమంత్రి, ఆ మేరకు జీఓ కూడా జారీ చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో 1.42 కోట్ల కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ పథకం వర్తింప చేస్తున్నామన్న ఆయన, ఆరోగ్యశ్రీ పరిధిని 2 వేల వ్యాధులకు విస్తరిస్తూ పశ్చిమ గోదావరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమలు చేశామని వెల్లడించారు. వచ్చే జూలై 8 నాటికి మరో 6 జిల్లాలకు ఆ ప్రాజెక్టు విస్తరిస్తామని, ఆ తర్వాత మిగిలిన 6 జిల్లాలలో నవంబరు నెలలో దీపావళి నుంచి ఆ ప్రాజెక్టు అమలు చేస్తామని తెలిపారు.

ఇప్పటికే 1200 జబ్బులకు పథకం వర్తింపచేస్తున్నామని గుర్తు చేసిన ఆయన, ఆరోగ్యశ్రీలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కూడా చికిత్స చేస్తున్నట్లు చెప్పారు.

'గతంలో వినికిడి లోపం ఉంటే, (మూగ చెవుడు ఉంటే) కాంక్లెయిర్ ఆపరేషన్ (సింగిల్) చేయించాలంటే కూడా చాలా కష్టంగా ఉండేది.

పాదయాత్రలో నన్ను చాలా మంది అడిగితే నేను స్వయంగా ఆపరేషన్లు చేయించాను. ఇవాళ డబుల్ కాంక్లెయిర్ ఆపరేషన్లు, బ్యాటరీతో పాటు, స్పీచ్ థెరపీ కూడా పథకంలోకి తీసుకువచ్చాము. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు దాదాపు 132 ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో నగరాల్లో వారికి ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి.

పథకాన్ని ఇంకా బలోపేతం చేస్తున్నాం. పేదలు అప్పులపాలు కాకూడదు. అదే లక్ష్యం' అని ముఖ్యమంత్రి వివరించారు.

**నెట్‌వర్క్ ఆస్పత్రులు—బకాయి బిల్లులు:**

గత ప్రభుత్వ హయాంలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అవి చికిత్సకు నిరాకరించాయని, దీంతో రూ.682 కోట్ల బకాయిలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించి, ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా చేశామని సీఎం చెప్పారు. ఫలితంగా ఇప్పుడు ఆ ఆస్పత్రులు చక్కగా సేవలందిస్తున్నాయని తెలిపారు.

ఇంకా ఆ ఆస్పత్రులకు గ్రేడింగ్ మొదలు పెట్టామని, బి—గ్రేడ్ ఆస్పత్రులన్నీ 6 నెలల్లో ఏ—కేటగిరీలోకి రావాలని నిర్దేశించామని, దీంతో అవి కూడా సౌకర్యాలు మెరుగుపర్చుకుంటున్నాయని చెప్పారు.

## వైయస్సార్ ఆరోగ్య ఆసరా:

ఆరోగ్యశ్రీలో రోగి వైద్యం చేయించుకుంటే, ఆ తర్వాత వైద్యులు సూచించినంత కాలం రోగికి ఆర్థిక సహాయం చేస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ తెలిపారు. రోజుకు రూ.225 చొప్పున లేదా నెలకు గరిష్టంగా రూ.5 వేలు సహాయం చేస్తున్నామని, ఇది విప్లవాత్మక మార్పు అని పేర్కొన్నారు.

'గతంలో చేయి విరిగితే ఆరోగ్యశ్రీలో చికిత్స చేస్తారా? అన్న భయం ఉండేది. ఇప్పుడు ఆ భయం లేదు. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్స చేయడంతో పాటు, ఆ తర్వాత విశ్రాంతి అవసరమైన సమయంలో కూడా ఆర్థిక సహాయం ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

## పెన్షన్లు

'ఇంకా 9 రకాల దీర్ఘకాల వ్యాధులతో బాధ పడే వారికి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్ ఇస్తున్నాం. పాదయాత్రలో చాలా మందిని చూశాను. మంచానికి పరిమితమైన వారిని చూశాను. వెన్నెముకకు దెబ్బతగిలిన వారిని, వీల్‌చైర్లకు పరిమితమైన వారిని, పక్షవాతంతో బాధ పడుతున్న వారిని కూడా చూశాను. అందుకే కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ.3 వేలు ఇస్తున్నాం. బోధకాలు, పక్షవాతం, గుండె ఆపరేషన్, కిడ్నీ మార్పిడి, తలసేమియా, డయాలసిస్ రోగులు, హీమోఫీలియా, సికిల్‌సెల్ అనీమియా బాధితులకు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల పింఛను వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దే పంపిణీ చేస్తున్నాం' అని సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు.

## ఆరోగ్యశ్రీ కార్డులు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్న వారికి కార్డులు ఇస్తున్నామని, ఆ కార్డులకు క్యూఆర్ కోడ్ ఉంటుందని, అందులో ఆ వ్యక్తికి సంబంధించిన అన్ని  రిపోర్టులు ఉంటాయని, కాబట్టి ఆస్పత్రులకు రిపోర్టులు కూడా తీసుకుపోవాల్సిన అవసరం ఉండదని చెప్పారు.

రాష్ట్రంలో మొత్తం 1.42 కోట్ల మందికి ఈ కార్డులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే 1.33 కోట్ల మందికి ఇచ్చామని, మిగిలిన వారికి మరో 2 వారాల్లో అందజేస్తామని, కోవిడ్–19 వల్ల ఈ జాప్యం జరిగిందని వెల్లడించారు.

**ఆస్పత్రుల్లో ఔషధాలు:**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతంలో మందులు తీసుకోవాలంటే భయంగా ఉండేదని, అవి కల్తీ అన్న మాట ప్రతి నోటా వినిపించేదని సీఎం గుర్తు చేశారు. ఆ పరిస్థితి ఇప్పుడు మారిందని, గతంలో ఆస్పత్రుల్లో 230 రకాల మందులు ఉంటే, వాటిని 500 రకాలకు పెంచామని, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూయహెచ్ఓ) ప్రమాణాలకు అనుగుణంగా వాటిని అందుబాటులో ఉంచామని చెప్పారు.

'నాకే కాదు, ప్రధాని స్థానంలో ఉన్న వ్యక్తికి బాగా లేకున్నా మన ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే మంచి మందులు దొరుకుతాయని గర్వంగా చెబుతున్నాను' అని సీఎం పేర్కొన్నారు.

ఇంకా ఇప్పుడున్న ఎన్ఈబీఎల్ ల్యాబ్‌లు 4 నుంచి 6కు పెంచామని, మూడు ప్రాంతీయ డ్రగ్ స్టోర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని, ఇప్పటికే అవి నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు.

**వైయస్సార్ కంటి వెలుగు:**

'ఈ ఏడాది కాలంలో ఆరోగ్యశ్రీకి మెరుగు కార్యక్రమాల్లో నా మనసుకు నచ్చింది కంటి వెలుగు. రాష్ట్రంలో ఉన్న వారందరికీ కంటి వైద్య పరీక్షల కోసం రూ.560 కోట్లతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. తొలుత దాదాపు 70 లక్షల మంది పిల్లలకు కంటి పరీక్షలు చేశాం. వారిలో 4.36 లక్షల మంది పిల్లలకు దృష్టి లోపం ఉందని గుర్తించారు. 1.58 లక్షల మంది పిల్లలకు కళ్లజోళ్లు అవసరమని తేల్చగా, వారిలో 1.29 లక్షల మంది పిల్లలకు ఇప్పటికే కళ్లద్దాల పంపిణీ చేశాం. స్కూళ్లు తెరవగానే మిగిలిన వాటిని పంపిణీ చేస్తాం'.

‘ఇంకా దాదాపు 46 వేల మంది పిల్లలకు ఆపరేషన్లు చేయాలని తేల్చారు. వారికి కూడా రాబోయే రోజుల్లో ఆపరేషన్లు చేయిస్తాము. దసరా సెలవుల్లో దగ్గరుండి ఆపరేషన్లు చేయిస్తామని హామీ ఇస్తున్నాను. కంటి వెలుగు రెండో దశలో అవ్వా తాతలు. వారికి పరీక్షలు. కళ్లద్దాల పంపిణీ ఆపరేషన్లు చేయిస్తాం. కోవిడ్ వల్ల ఆగిపోయాయి’ అని సీఎం శ్రీ వైయస్ జగన్ వివరించారు.

**రెండు వారాల్లో సర్టిఫికెట్లు:**

గతంలో సదరమ్ క్యాంప్‌ల్లో (వికలాంగుల కోసం) సర్టిఫికెట్ కోసం 4 నెలలు వేచి చూడాల్సి వచ్చేది. అప్పుడు కూడా అవి ఇచ్చే వారు కాదని సీఎం చెప్పారు. గతంలో 57 చోట్ల సదరమ్ క్యాంప్‌లు జరగ్గా, వాటిని 167కు పెంచామని, ప్రతి సీహెచ్‌సీలో సదరమ్ క్యాంప్‌ల నిర్వహిస్తున్నామని, దీంతో కేవలం రెండు, మూడు వారాల్లోనే సర్టిఫికెట్లు జారీ చేయగలుగుతున్నామని చెప్పారు.

**ఆస్పత్రులు:నాడు–నేడు**

నాడు–నేడు కార్యక్రమంలో ఆస్పత్రుల రూపురేఖల మారుస్తామన్న సీఎం, ప్రస్తుతం ఆస్పత్రుల పరిస్థితిపై ఫోటో. ఆ తర్వాత మూడేళ్లలో మార్పులు చేసి ఫోటోలు చూపుతామని వెల్లడించారు. ్ససబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తామని తెలిపారు.

మొత్తంగా 27 టీచింగ్ ఆస్పత్రులు ఉండేలా చూస్తున్నామన్న ముఖ్యమంత్రి, ఇప్పుడు 11 టీచింగ్ ఆస్పత్రులు ఉంటే మరో 16 ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో కొత్తగా 7 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

నాడ–నేడులో రాష్ట్రంలోని ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, కొత్త వాటి నిర్మాణం.. ఇలా ప్రజారోగ్యంపై మొత్తం మీద రూ.16 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, ఆ విధంగా ఆస్పత్రుల రూపు రేఖలు మార్చబోతున్నామని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులను మారుస్తామని పేర్కొన్నారు.

## విలేజ్, వార్డు క్లినిక్‌లు:

ప్రతి ఊరి రూపురేఖలు మార్చబోతున్నామన్న సీఎం, 2 వేల జనాభా ఉన్న గ్రామంలో సచివాలయం, వలంటీర్ల సేవలు, ఇంగ్లిష్ మీడియమ్ స్కూల్, ఒక విలేజ్ క్లినిక్ ఉంటాయని చెప్పారు. ఆ క్లినిక్‌లో ఆశా వర్కర్లు రిపోర్టు చేస్తారని, ఏఎన్ఎం నర్సు ఉంటారని, అక్కడ 54 రకాల మందులు కూడా ఉంటాయని తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు ఆరోగ్యశ్రీకి రెఫరల్ పాయింట్‌గా పని చేస్తాయని, కాల్ చేసిన వెంటనే 108, 104 సర్వీసులు 20 నిమిషాల్లో చేరుకుంటాయని చెప్పారు.

దాదాపు 13 వేలకు పైగా విలేజ్ క్లినిక్‌లు, వార్డు క్లినిక్‌ల నిర్మాణానికి రూ.2600 కోట్ల వ్యయంతో శ్రీకారం చుట్టామని, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి అవి పూర్తి అవుతాయని వివరించారు.

## ఆరోగ్య కేంద్రాలు: నాడు–నేడు

నాడు–నేడులో కొత్తగా 149 పీహెచ్‌సీలు నిర్మించడంతో పాటు, దాదాపు 1138 పీహెచ్‌సీల్లో మార్పులు చేస్తున్నామని, ఇందు కోసం రూ.671 కోట్లు ఖర్చవుతుండగా, ఇప్పటికే పనులు మొదలు పెట్టారని, వాటిని కూడా మార్చి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

52 ఏరియా ఆస్పత్రుల రూపురేఖలు మార్చడం కోసం రూ.695 కోట్లతో టెండర్లు, 169 సీహెచ్‌సీల రూపురేఖల మార్పు కోసం రూ.541 కోట్లతో టెండర్లను 15 రోజుల్లో పిలుస్తామని తెలిపారు.

## టీచింగ్ ఆస్పత్రులు:

ఇప్పుడున్న 11 టీచింగ్ ఆస్పత్రుల రూపురేఖలు మార్చడం, కొత్తగా 16 టీచింగ్ ఆస్పత్రుల నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో 7 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పనులకు ఆగస్టులో టెండర్లు పిలుస్తామని సీఎం వెల్లడించారు.  రూ.12,270 కోట్లు ఖర్చుతో ఆ పనులను మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి మెడికల్ కాలేజీకి నర్సింగ్ కళాశాల కూడా ఉంటుందని చెప్పారు.

**1060 అంబులెన్సులు:**

108, 104 సర్వీసులు గతంలో దారుణంగా ఉండేవన్న సీఎం, వాటిని కూడా మారుస్తున్నామని చెప్పారు. జూలై 1న విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ఒకేసారి 1060 అంబులెన్సులు (108, 104 సర్వీసులు) ప్రవేశపెడుతున్నామని చెప్పారు.

**వైయస్సార్ టెలి మెడిసిన్**

కోవిడ్ సమయంలో ఆరోగ్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపామన్న సీఎం శ్రీ వైయస్ జగన్, ఎవరికి ఏ వైద్యం అవసరం ఉన్నా, తోడుగా ఎలా ఉండాలన్న ఆలోచనతో వైయస్సార్ టెలి మెడిసిన్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు.

'14410 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే చాలు. ఈ సేవల కోసం దాదాపు 300 మంది వైద్యులు పని చేస్తున్నారు. మిస్డ్ కాల్ రాగానే, సెంటర్ నుంచి తిరిగి ఫోన్ చేస్తారు. రోగి వివరాలు తెలుసుకుని వెద్యులు మందులు ప్రిస్కైబ్ చేస్తారు. ఆ మందులను మర్నాడే రోగి ఇంటికి డోర్ డెలివరీ చేస్తారు. దీనికి ఇంకా మెరుగులు దిద్దడం కోసం జూలై 1 నుంచి ప్రతి పీహెచ్‌సీకి ఒక బైక్, థర్మో బ్యాగ్ కూడా సమకూరుస్తున్నాం. దీంతో రోగి ఇంటికే వెళ్లి వేగంగా మందులు ఇస్తారు' అని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ వివరించారు.

**సిబ్బంది నియామకం:**

ఆస్పత్రుల్లో మెరుగైన సేవల కోసం అవసరమైన సిబ్బందిని నియమిస్తున్నట్లు సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు. వైద్యులు, నర్సులు ఎందరు కావాలన్న దానిపై జాతీయ ప్రమాణాల (ఐపీహెచ్‌ఎస్–ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్) ప్రకారం చూస్తే, 9712 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉందని తెలిపారు. ఆ మేరకు వారం రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని, నెలన్నర వ్యవధిలో నియామకాలు పూర్తి చేస్తామని చెప్పారు.

## కోవిడ్–సన్నద్ధం:

ఆరోగ్యశ్రీలో ఇలాంటి అనేక కార్యక్రమాలు, మార్పులు చేస్తూనే, మరోవైపు కరోనా నియంత్రణ, నివారణ కోసం యుద్ధప్రాతిపదికన అడుగులు ముందుకు వేశామని సీఎం చెప్పారు. ఆ విధంగా సిబ్బంది సేవలందించారని, అందుకు వారిని అభినందించాలని పేర్కొన్నారు.

'ఒక ల్యాబ్‌తో మొదలు కాగా, ఇప్పుడు జిల్లాకు ఒకటి చొప్పున 13 ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. అదే విధంగా మరో 337 ట్రునాట్ యంత్రాలు సీహెచ్‌సీల్లో అందుబాటులోకి రానున్నాయి. కోవిడ్ రాకముందు రోజుకు కనీసం 2 పరీక్షలు చేసే పరిస్థితి లేదు. కానీ ఇప్పుడు రోజుకు 10 వేల నుంచి 11 వేల టెస్టులు చేసే సామర్థ్యానికి ఎదిగాం. ఇప్పటి వరకు దాదాపు 3.42 లక్షల పరీక్షలు చేసిన పరిస్థితి. 10 లక్షల జనాభాకు రాష్ట్రంలో 6627 పరీక్షలు చేశాం. ఇది దేశంలో అత్యధికం'.

'దేశం మొత్తం మీద పాజిటివ్ కేసు రేటు 4.71 శాతం కాగా, మన రాష్ట్రంలో అది 0.95 «శాతం మాత్రమే. రికవరీ రేటు దేశంలో 42.75 శాతం ఉంటే మన రాష్ట్రంలో అది 65.49 శాతం మాత్రమే. అదే విధంగా మరణాల రేటు దేశ సగటు 2.86 శాతం ఉంటే, మన దగ్గర 1.82 మాత్రమే అని చెప్పగలుగుతాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

## సమాజాన్ని సిద్ధం చేశాం:

కరోనా మీద యుద్ధంలో మనం దేశంలో అగ్ర స్థానంలో ఉన్నామని, ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఈ అత్యవసర పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవడంలో సమాజాన్ని సిద్ధం చేశామని చెప్పారు. కోవిడ్ అన్నది పోదని, దాంతో సహజీవనం చేయక తప్పదని చెప్పారు.

## స్టిగ్మా పోవాలి:

'కోవిడ్ సోకితే వారిని దూరం చేయకండి. ఎందుకంటే రేపు ఎవరికైనా రావొచ్చు. 98 శాతం రికవర్ అవుతున్నారు. కేవలం 2 శాతం మాత్రమే చనిపోతున్నారంటే, అంత ప్రమాదం లేదు. 85 శాతం మంది కేవలం ఇంట్లోనే వైద్యంతో బయట పడుతున్నారు. రాబోయే రోజుల్లో ఎవరికైనా రావొచ్చు. వస్తుంది.

పోతుంది. కాబట్టి సహజీవనం తప్పదు. మన ఇంట్లో పెద్దవారిని బాగా చూసుకోవాలి. ఈ స్టిగ్మా పోవాలి. వ్యాక్సీన్ ఎప్పుడు కనుగొంటారో తెలియదు. కాబట్టి అందరం అలవాటు చేసుకోవాలి' అని సీఎం స్పష్టం చేశారు.

**ఆస్పత్రులు—ఏర్పాట్లు:**

కోవిడ్ విషయంలో పూర్తి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కోవిడ్ చికిత్స కోసం రాష్ట్ర స్థాయిలో 5 ఆస్పత్రులు ఏర్పాటు చేశామని, ఇంకా ప్రతి జిల్లాలో ఆస్పత్రులు ఉండే విధంగా మొత్తం 65 జిల్లా స్థాయి ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వాటిలో 38 వేల ఐసొలేషన్ బెడ్లు రెడీగా ఉండగా, వాటిలో 15 వేల బెడ్లకు ఆక్సీజన్ సరఫరా సౌకర్యం కలిగి ఉన్నాయని తెలిపారు.

ఆ 15 వేల బెడ్లలో 5400 బెడ్లు ఐసీయూలో ఉండగా, వాటిలో 1350 బెడ్లకు వెంటిలేటర్లు రెడీగా ఉన్నాయని చెప్పారు. ఇంకా 24 వేల మంది డాక్టర్లు, 22,500 మంది పారా మెడికల్ సిబ్బంది కోవిడ్ చికిత్స కోసం రెడీగా ఉన్నారని సీఎం శ్రీ వైయస్ జగన్ వివరించారు.